యధావిధిగా అధిక టన్నేజీ రవాణా

పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం- ఛిద్రమవుతున్న రహదారులు- కింది నుంచి పైదాకా మామూళ్లు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పారిశ్రామిక ప్రాంతమైన ఎర్రగుంట్లలో అధిక టన్నేజీతో వాహనాల రవాణా యధావిధిగా కొనసాగుతోంది. పత్రికల్లో కథనాలు వచ్చిన సందర్భాలలో మాత్రమే సంబందిత అధికారులు తూతూమంత్రంగా నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శ బలంగా నెలకొంది. తనిఖీల సమయంలో ఒకటి, అర వాహనాలు కలిగిన పేద యజమానులు మాత్రమే భారీ జరిమానాలకు బలి అవుతున్నారే తప్ప రూ.లక్షలు

ఆర్జిస్తున్న బడా యజమానులు మాత్రం జరిమానాల బారిన పడకుండా చాకచక్యంగా తప్పించుకుంటున్న వైనం వెనుక మామూళ్లు పనిచేస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. యర్రగుంట్ల ప్రాంతం నుండి నాపరాళ్లు తమిళనాడు రాష్ట్రానికి రవాణా అవుతుంటాయి. పాసింగ్ విధానంలో రాళ్లను రవాణా చేస్తే అటు ట్రేడర్‌కు ఇటు లారీ యజమానికి పెద్దగా లాభాలు ఉండవన్న ఉద్దేశ్యంతో అధిక టన్నేజీతో రవాణా విధానం కొనసాగుతోంది. ఇదే సంబందిత అధికారులకు కల్ప వృక్షంలా మారింది. టన్నేజీ సాకుతో ప్రతి నెల ఒక్కో యజమాని నుండి కొంత మొత్తాన్ని వారు వసూలు చేసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అధిక టన్నేజీ వాహనాల కారణంగా రహదారులు ఛిద్రమవుతున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. అనేక రోడ్డు ప్రమాద ఘటనలకు కూడా ఇది కారణంగా నిలుస్తోంది. సహజంగా 12 టైర్ల లారీలో 25 టన్నుల వరకు రవాణా చేసే వెసులుబాటు ఉంది. అయితే సుమారు 50 టన్నుల వరకు రవాణా చేస్తుండడం గమనార్హం. అలాగే 14 టైర్ల లారీలు 30 టన్నులకు గాను 60 నుంచి 65, 16 టైర్ల లారీ ద్వారా 33 టన్నులు రవాణా చేయాల్సిఉండగా 70 నుంచి 80 టన్నుల వరకు రవాణా చేస్తుండడం బహిరంగ రహస్యం. ఇవన్నీ ప్రభుత్వ శాఖలకు తెలియంది కాదు. అయితే నిబంధనలను సాకుగా చూపి నెల మామూళ్లకు తెరలేపిన ఫలితంగానే ఈ వ్యవహారం యధేచ్ఛగా కొనసాగుతోందని పలువురు గుర్తుచేస్తున్నారు. అధిక టన్నేజీ రవాణా మామూళ్లపై కొందరు లారీల యజమానులు బహిరంగంగానే తాము ప్రతి నెల సమర్పించుకుంటున్న ముడుపుల వ్యవహారాన్ని చెబుతున్న తీరు సదరు శాఖల పనితీరుకు అద్దం పడుతోందని చెప్పవచ్చు. ముఖ్యంగా కడప, రాయచోటి, చిత్తూరు పట్టణా ల్లోని రవాణా శాఖ కార్యాలయాల ఎదురుగుండానే ఈ లారీలు ప్రయా ణించడం కొసమెరుపు. ఎర్రగుంట్ల నుండి నిబంధనల మేరకు రవాణా చేసే లారీలు (పాసింగ్) రాజమార్గం ద్వారా కడప, రాజంపేట మీదుగా తమిళనాడుకు వెళుతుండగా అధిక టన్నేజీ వాహనాలు మాత్రం ఎర్రగుంట్ల నుండి వేంపల్లె మీదుగా రాయచోటి, చిత్తూరు వెళుతుండగా మరికొన్ని కడప, రాయచోటి మీదుగా తమిళనాడుకు వెళుతుండడం గమనార్హం. ఈ విధానం సంబంధిత అధికారులకు తెలియంది కాదు. ఎవరైనా ప్రజాస్వామికవాదులు రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి అధిక టన్నేజీ వ్యవహారాన్ని తీసుకెళితే మీరు మాకు ఆ లారీలు వెళ్లే సమయాన్ని, మార్గాన్ని తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని చెబుతుండడం ఏ మేరకు సబబో సదరు అధికారులే ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంది.

ఫ్లయాష్ రవాణా కూడా అంతే: ఇక్కడి రాయలసీమథర్మల్ విద్యుత్ కేంద్రం నుండి బయటి ప్రాంతాలకు రవాణా అవుతున్న ఫ్లయాష్ (బూడిద) రవాణా వ్యవహారంలోకూడా ఎలాంటి మార్పు లేదు. టిప్పర్లు, ట్యాంకర్ల ద్వారా అధిక టన్నేజీ రవాణా చేస్తుండడం యధావిధిగా కొనసాగుతూనే ఉంది. ఇక్కడ ఓ ట్విస్టు ఉంది. బడా ట్రాన్స్‌పోర్టు యజమానుల కనుసన్నల్లో సంబందిత శాఖల అధికారులు ఉన్నారన్న వాదన బలంగా ఉంది. బడా కాంట్రాక్టర్లను కాదని ఎవరైనా టిప్పర్ల ద్వారా ఫ్లయాష్‌ను రవాణా చేస్తే వెంటనే రంగంలోకి దిగి ఆ వాహనాలకు భారీగా జరిమానాలు విధించి వాటి యజమానులను భయభ్రాంతులకు గురిచేయడం రవాణాశాఖ అధికారుల పనితనానికి మచ్చుతునకలా ఈ ప్రాంతంలో ఖ్యాతి నిలిచింది. దీని వెనుక బడా ట్రాన్స్‌పోర్టు యజమానుల హస్తం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల పత్రికల్లో వచ్చిన వరుస కథనాలపై స్పందించిన అధికారులు నాలుగు వాహనాలకు రూ.3లక్షల మేర జరిమానాలు విధించి తామేదో ఘనకార్యాలు చేసినట్లు మురిసిపోయారు. నిజానికి అధికారులు ఆర్టీపీపీ వద్దకు వచ్చిన సమయంలో బడా కాంట్రాక్టర్ల టిప్పర్లు మైదానంలో ఎందుకు నిలిచిపోయాయో ఎవరు సమాధానం చెప్పగలరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ముందస్తు సమాచారంతోనే ఆ వాహనాలు మైదానంలో నిలిచిపోయాయన్న వాదన ఉంది.

రాత్రి సమయాల్లో ఎలా ? డీటీసీ మీరా ప్రసాద్: అధిక టన్నేజీ వ్యవహారంపై కడపలోని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ (డీటీసీ) మీరా ప్రసాద్‌ను వివరణ కోరగా తాము ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నామని రాత్రి సమయాల్లో కొనసాగే అధిక టన్నేజీ రవాణాపై ఎలా చర్యలు తీసుకోవాలంటూ ఎదురు ప్రశ్నించారు.

అయినప్పటికీ తాము గత నెలలో ఇసుక, ఫ్లయాష్ వాహనాలకు అధిక మొత్తంలో జరిమానాలు విధించామని గుర్తుచేశారు. మామూళ్ల వ్యవహారంపై ఆయన సమాధానాన్ని దాటవేశారు. ఎవరైనా సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటామని చెబుతూ మీ వద్ద బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల నెంబర్లు ఉన్నాయి కదా సమాచారం ఇవ్వండని సూచించడం కొసమెరుపు. కాగా సమాజం సక్రమంగా ఉండేందుకు ఆయా శాఖలకు నిర్దేశించిన విధులను సమర్థవంతంగా నిర్వహించడం ఒక్కటే ప్రధానం. అలాకాకుండా ఇతరులు జోక్యం చేసుకుంటే చెడు ఫలితాలు తప్పక వస్తాయని అనేక నీతికథలు పెద్దలు చెప్పి ఉన్నారు. ప్రభుత్వశాఖలు తమ పరిధిలో విధులను సక్రమంగా నిర్వహించడం ద్వారానే ఎలాంటి అక్రమాలనైనా అరికట్టే ఆస్కారం ఉంటుంది.

జిల్లా అధికారులు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప జిల్లా అధికారులు పరిశీలించి నాకు న్యాయం చేయాలని బాధితుడు మేక చిన్నప్ప కోరారు. సోమవారం తమ నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ 2012లో నాకు మామిళ్ళ పల్లె పంచాయతీ ఇందిరానగర్‌లో నివాస స్థలం ప్రభుత్వం ఇచ్చారని తెలిపారు. నాకు ఆర్థిక స్తోమత లేనందున అప్పట్లో ఆ స్థలం వేసుకున్నాను. అప్పట్లో ఇంటిని నేను నిర్మిస్తున్నప్పుడు రెవిన్యూ సిబ్బంది వచ్చి నిలుపుదల చేయమంటే నేను హైకోర్టుకు వెళ్లానని తెలిపారు. హైకోర్టు నుంచి నాకు ఇంటిని నిర్మించుకోమని ఆర్డర్ ఇచ్చారని తెలిపారు కోర్టు ఇచ్చిన ఆర్డర్ను ఎమ్మార్వో కు సమర్పించామని తెలిపారు. అయినా సోమవారం మేము ఎవరూ లేరు సమయంలో నోటీస్ కూడా ఇవ్వకుండా ఎటువంటి సమాచారం తెలపకుండా రెవెన్యూ సిబ్బంది వచ్చి నిర్మాణం చేపడుతున్న ఇంటిని కూల దోచారని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి నాకు నా కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

అంగన్వాడీ కార్యకర్త వేతనాన్ని ఇప్పించండి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ పరిధిలోని చాపాడు మండలం కుచ్చుపాప అంగన్వాడీ కేంద్రం నందు కార్యకర్తగా పనిచేస్తున్న ఆర్.రుక్మిణమ్మను 2022ఆగస్టు, అక్టోబర్, నవంబర్‌కు సంబంధించి గౌరవ వేతనం పెండింగ్‌లో ఉందని వెంటనే ఇప్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు సీడీపీఓ కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలాగే వెదురూరు అంగన్వాడీ కేంద్రం బీసీ సెంటర్‌కు సంబంధించి ఎం.అమరావతి 2002 నుంచి అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తుందని, అయితే ఈ సెంటర్ నందు పనిచేస్తున్న విజయలక్ష్మి ఆయాగా ఐసీడీఎస్ వారు 2015 నవంబర్ నుండి నియమించారు అని, కానీ ఈ ఆయా విజయలక్ష్మి 2022 ఏప్రిల్ మాసం నుండి ఇప్పటివరకు విధులకు హాజరుకావడం లేదని పలుమార్లు గత సూపర్‌వైజర్ శారద గారికి, సీడీపీఓ అరుణకుమారి గార్లకు ఆయా సమస్యను వ్రాతపూర్వకంగా వ్రాసి ఇచ్చిన ఎటువంటి చర్యలు లేవు అన్నారు. ఇందుకు కారణంగా అంగన్వాడీ కేంద్రం నిర్వహణ మరియు ఐసీడీఎస్ వారి సెక్టార్ సమావేశాలకు హాజరు కావాలని తీవ్ర ఇబ్బందులను అంగన్వాడీ కార్యకర్త ఎం.అమరావతి ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు మీరు దయచేసి చర్యలు తీసుకొని రుక్మిణమ్మ పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరారు. అలాగే ఎం.అమరావతికి కొత్త ఆయాను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసి ప్రక్రియకు ప్రభుత్వం వారు ఆదేశించి విధులకు ఆటంకం కలగకుండా చూడగలరని ఏఐటీయూసీ ప్రొద్దుటూరు సమితి కోరుతున్నదని అన్నారు.

ప్రశాతంగా పది పరీక్షలు



విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో పకడ్బందీగా 10వ తరగతి పరీక్షలను నిర్వహించడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తుతో పాటు ఇన్విజిరేటర్లను, చీఫ్ డిపార్ట్‌మెంట్ ఒక్క సెంటర్‌కు 9మంది చొప్పున ఏర్పాటుచేయడం జరిగిందని పరీక్షల అబ్జర్వేజర్ వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు సంధర్భంగా జిల్లా వ్యాప్తంగా 27,211మంది పరీక్షలకు హాజరుఅయ్యారని పరీక్షలు రాస్తున్న విధ్యార్ధులకు ఉచిత బస్ సౌకర్యంతో పాటు 146పరీక్షా కేంద్రాలలో చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులు 146మంది, అడిషనల్‌గా కొంతమందిని మరో 6టీంలను ప్రత్యేకంగా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. అందులో భాగంగానే బ్రహ్మంగారి మఠం మండలంలో మూడు పరీక్షా కేంద్రాలలో గురుకుల పాఠశాలలో 177మందికి గాను 176మంది హాజరైనట్లు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 170మందికి గాను 169మంది విధ్యార్థులు, కేజీబీలో 108మంది విధ్యార్థులకు గాను 105మంది హాజరైనట్లు తెలిపారు. క్వశ్చన్ పేపర్ లీక్ అయిందని ముబైల్‌లలో రావడంతో దానిపైన జిల్లా అధికారులు, మైదుకూరు రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి సమక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారులు రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆరా తీశారు. ఓ జిరాక్స్ సెంటర్‌లో క్వశ్చన్ పేపర్ లీకేజీ అని బయటకు రావడంతో దానిపైన ఆరా తీస్తున్నామని వారు తెలిపారు. దానిపై ఆరా తీయగా మైక్రో జిరాక్స్ రావడంపై ఆరా తీస్తున్నామని ఏ సెంటర్ నుండి వచ్చిందా అనే దానిపై ఆరా తీస్తున్నామని అన్నారు.

నవనీతకృష్ణాలంకారంలో రామయ్య ముగ్ధమనోహర రూపం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీతకృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీమతి విజయలక్ష్మి, ఏఈఓ శ్రీ గోపాలరావు, సూపరింటెండెంట్లు శ్రీ పి.వెంకటేశయ్య, శ్రీ ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ధనంజయ పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన అంకాలమ్మ తిరుణాల

విశాలాంధ్ర - వల్లూరు : భక్తుల కోర్కెలు తీర్చే అంకాలమ్మ తిరణాల వైభవంగా ముగిసింది సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. మండల వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు స్థానిక పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో భద్రత కల్పించారు.దాతలు భక్తులకు అన్నదానం, మజ్జిగ తాగు నీటిని అందించారు.సాయంత్రం కొర్ల బండిని ప్రత్యేకంగా అలంకరించడంతో చూసేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.కొర్ల బండిని ఆలయం చుట్టూ తిప్పారు.

పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు: స్థానిక అంకాలమ్మ తిరుణాల సందర్భంగా పాల పండ్ల ఎద్దుల వృషభరాజముల దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో పోటీ దారులు హోరాహోరీగా సాగాయి ఎక్కువ రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు జరిగాయి ఈ పోటీల్లో మొదటి బహుమతిగా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్ ఎద్దులు రూ.50000 గెలుచుకోగ బహుమతి చాగం రెడ్డి భాస్కర్ రెడ్డి ఎద్దులు రెండో బహుమతి రూ 40000, తిప్పిరెడ్డిపల్లి విశ్వనాథరెడ్డి ఎద్దులు మూడో బహుమతి రూ 30000, కుర్ర వెంకటేష్ యాదవ్ ఎద్దులు నాలుగో స్థానంలో రూ 20000 వీరి ఎద్దులు బహుమతులు గెలుపొందాయి.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యం : టీడీపీ

విశాలాంధ్ర - మైలవరం : రాష్ట్ర అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్య పడుతుందని జమ్మలమడుగు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ భూపేష్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని దన్నవాడా గ్రామంలో న్యూ కేటగిరి విభాగంలో జరిగిన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేష్,టీడీపీ నేత బాల వెంకట గోవింద్ యాదవ్ మాట్లాడుతు రాష్ట్రములో అభివృద్ధి కంటే అప్పులు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు .రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమని టీడీపీ అధికారంలోకి ప్రజల మద్దతుతో వస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు.రాబోయే ఎన్నికలలో టీడీపీ కి పట్టం కట్టెందుకు సిద్ధంగా వున్నారని తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి నగదు బహుమతిని భూపేష్, బాలవేంకట గోవింద్ యాదవ్, వద్దిరాల మాజీ సర్పంచ్ రామ గోవింద్ యాదవ్ లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమములోమాజీ ఎంపిపి అల్లే ప్రభావతి,వద్దిరాల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ మండల ఇంచార్జి చిన్న పాపిరెడ్డి,టీడీపీ నేతలు కొండయ్య యాదవ్, సూర్యాపేద్ది రాజు యాదవ్,వేంపలకు బాలరాజు యాదవ్, నిలికంఠ రెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణ మహోత్సవం



విశాలాంధ్ర -రాజంపేట: మండల కేంద్రంలోని హస్త వరం చేర్లోపల్లి గ్రామపంచాయతీలో సోమవారం సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని గ్రామస్తులు వేడుకగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం వేద పండితులు ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని కనులారా చూశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 4 పరీక్షలు విజయవంతం చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఏపీపీ ఎస్సీ గ్రూప్ 4 కంప్యూటర్ ఆధారిత ఏపీ రెవెన్యూ శాఖకు సంబంధించి జూని యర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ పోస్ట్ మెయిన్ ఈనెల 4వ తేదీన మంగళవారం జరుగు పరీక్షలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని జిల్లా రెవెన్యూ అధికారి తన చాంబర్ నందు ఏపీపీఎస్సీ గ్రూప్ 4 కంప్యూటర్ ఆధారిత ఏపీ రెవెన్యూ శాఖ కు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ పోస్ట్ మెయిన్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ ఏపీపీఎస్సీ గ్రూప్ 4 కంప్యూటర్ ఆధారిత ఏపీ రెవెన్యూ శాఖ కు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ పోస్ట్ మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పరీక్షలు జిల్లాలో 2 సెషన్స్ (ఉదయం, మధ్యాహ్నం) లలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలు ఉదయం సెషన్ 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగునని అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే హాజరు కావాలని, అలాగే మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులు ఒక గంట ముందుగానే హాజరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, ఏపీపీఎస్సి సెక్షన్ ఆఫీసర్ సి.హెచ్. సాయి ప్రకాష్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎన్. శ్రీనివాసరావు, వివిధ కాలేజీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళా మృతి

విశాలాంధ్ర- అట్లూరు : అట్లూరు మండలం సోమశిల ముంపు గ్రామమైన కుంభగిరి గ్రామ పంచాయతీ ఎస్. వెంకటాపురం (రంగంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఎస్. గంగమ్మ(46) గుండెపోటుతో మరణించారు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కడప రిమ్స్‌కు తీసు కెళ్ళారు. అనంతరం కడప రిమ్స్‌లో చికిత్స చేస్తుండగా ఆమె మృతిచెం దినట్లు డాక్టర్లు తెలిపారు.

హనుమంత వాహనంపై సీతారామలక్ష్మణుల విహారం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం రాత్రి విశేషమైన హనుమంత వాహన సేవ వైభవంగా జరిగింది. శ్రీ సీతారామలక్ష్మణులు ప్రియభక్తుడైన హనుమంత వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుండి కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి దర్శించుకున్నారు. హనుమం తుడు తనను సేవించే భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదిస్తున్నారు. దాసభక్తికి ప్రతీకగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శ్రీ నటేష్ బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఏఈఓ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్ లో సీజీఆర్ టాలెంట్ మీట్ ప్రారంభం

విశాలాంధ్ర - రాజంపేట: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాజంపేట నందు సోమవారం సీజీఆర్ టాలెంట్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్.వీ.ఎస్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎస్వీ యూనివర్సిటీ కాలేజ్ ఇంజనీరింగ్ వారు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.వీ.ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం వలన సిలబస్ పుస్తకాలలో లేని నూతన విషయాలను తెలుసుకోవడానికి దోహద పడుతుందని పేర్కొన్నారు. అలాగే వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం వలన విభిన్నమైన టెక్నాలజీ విషయాలను ఒకరికొకరు తెలుసుకోవచ్చన్నారు. తాను విద్యార్థులను ప్రోత్సహించడం వలన వారు ప్రస్తుతం ఉన్నత స్థానాలలో స్థిరపడి ఉన్నారని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు కళాశాలలో నిర్వహించడం వలన విద్యార్థులు అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని తమ కళాశాలలో జరుపుతున్నామని, ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తమ కళాశాలలోని విద్యార్థుసు ఉత్సాహపడుతున్నారన్నారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొని తమ నైపుణ్యతను పెంచుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఎం సుబ్బారావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ముఖ్యఅతిథులు, ఇతర కళాశాలల విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. చివరగా కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధికి తమ కళాశాలలో అన్నివసతులు ఏర్పాట్లు చేశామని, కావున విద్యార్థులు కళాశాల అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి నరేష్ కుమార్, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం పద్మలలిత, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ హేమంత కుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ నాగరాజు, వివిధ విభాగాధుపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట కల్యాణోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు: ఎస్పీ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఈ నెల 5 న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 5 న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పోలీసు అధికారుల ను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుక కావడం, పలువురు వి.ఐ.పిలు విచ్చేయనుం డడంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కళ్యాణం రోజున ట్రాఫిక్ ను మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక వద్ద సిసి టీవీలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ముఖ్యమైన ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా, అన్నప్రసాదాల పంపిణీ వద్ద తోపులాట లేకుండా బ్యారికేడ్లు, కల్యాణానికి వచ్చే భక్తులకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్.పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి ఐ.పి.ఎస్, ప్రొద్దుటూరు ఏ.ఎస్పీ (ట్రైనీ) కుమార్ ఐ.పి.ఎస్, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ పూజిత నీలం, అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ డా. వి.బి రాజ్ కమల్, ఏ.ఆర్ అదనపు ఎస్.పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : జగనన్న కాలనీ లబ్ధిదారులకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి 1,80,000 నుంచి 5 లక్షల వరకు ఇవ్వాలనీ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కడప నగరంలోని 50వ డివిజన్ సచివాలయ అడ్మిన్ వెంకట పుత్తయ్యకి, బికెఎంయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగడపూల మల్లికార్జున, సి. సుబ్రహ్మణ్యం వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేనే ఇల్లు కట్టించి మీ చేతికి తాళాలు ఇస్తామని చెప్పిన హామీని పక్కనపెట్టి కాలనీలలో రోడ్లు నీళ్లు విద్యుత్ సదుపాయాలు కల్పించకుండా జగనన్న కాలనీలల్లో ఇల్లు కట్టుకోవాలంటూ లబ్ధిదారులపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. మౌలిక సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకంపట్ల గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోకపోవడం సిగ్గుచేటని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఇవ్వాలని,జగనన్న కాలనీలలో మాలిక వసతులను కల్పించాలని వారు డిమాండ్ చేసారు. జగనన్న కాలనీ లేఅవుట్ లల్లో ఇప్పటికీ మౌలికవసతుల కొరత ఉండటం దారుణమన్నారు. నీళ్లు, రోడ్లు విద్యుత్ లేక ఇచ్చిన ఇళ్ళను సకాలంలో కట్టుకోలేకపోతున్నారు. కట్టుకోలేక పోయిన వారందరి ఇంటి పట్టాలను ఆగమేగాలపై రద్దు చేసిన జగన్ ప్రభుత్వం ఇప్పటికీ కూడా రోడ్లు,నీళ్లు, విద్యుత్ తదితర మౌలిక సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జగనన్న కాలనీలో నీటి సరఫరా లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం కన్నా ముందు సింక్ నిర్మాణం చేపడుతూ, నీళ్ళ ట్యాంక్ ల ద్వారా నీళ్లను రోజుకు 900 రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఒత్తిళ్ళతో ఆర్థిక అప్పుల భారంతో స్థానిక మౌలిక సమస్యలు ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కనీసం గ్రావెల్ రోడ్డు కూడా కాకుండా మట్టి దారులే ఉండటం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వం ఇచ్చే లక్షా 80 వేల రూపాయలు ఏమాత్రం సరిపోవని, పెరిగిన ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలకనుగుణంగా కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. మెయిన్ రోడ్డు నుండి లేఅవుట్ కాలనీలోకి తక్షణమే తారు రోడ్డు నిర్మించాలని, వీధిలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించనదే, పోరాటం చేయనిదే తోలు మంద ప్రభుత్వానికి జనం సమస్యలు పట్టవని లబ్ధిదారులను కలుపుకొని పోరాటానికి శ్రీకారం చుడతామని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు మనోహర్ రెడ్డి శేఖర్ రెడ్డి, అంకుశం, గంజికుంట నాగరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి :ఎస్పీ

విశాలాంధ్ర-కడప క్రైం : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఆశ్రమానికి అటవీశాఖ అనుమతి మంజూరుకు వినతి

విశాలాంధ్ర-పులివెందుల/ కాశినాయన : వైఎస్సార్ జిల్లా కాశిరెడ్డినాయన మండలం జ్యోతి క్షేత్రంలో వెలసిన కాశిరెడ్డి నాయన ఆశ్రమం అభివృద్ధికి అటవీ శాఖ అను మతులు మంజూరు చేయాల ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు. ఆ మేరకు ఆయన సోమవారం ఢిల్లీలోని నేషనల్ బోర్డ్ వైల్డ్ లైఫ్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సెక్రటరీ సత్య ప్రకాష్ యాదవ్‌ను కలిసి అటవీశాఖ అనుమతుల విషయంపై చర్చించా రు. అనంతరం ఈ విషయమై ఆయన సత్యప్రసాద్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయంపై గతంలో ఏపీ ప్రిన్సి పల్ సెక్రటరీ ద్వారా అటవీశాఖకు 2023 మార్చి 20 వతేదీన పంపిన లేఖను వినతిపత్రానికి జతచేసినట్లు అవినాశ్‌రెడ్డి వివరిం చారు. అటవీశాఖ అనుమతుల ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీ లో పెట్టి వీలైనంత త్వరలో ఆమోదం తెలపాలని ఎంపీ సత్య ప్రకాశ్ యాదవ్‌ను కోరారు. సత్య ప్రకాష్ యాదవ్ సానుకూలంగా స్పందించినట్లు అవినాష్‌రెడ్డి వెల్లడించారు.

కోదండరాముని సన్నిధిలో యర్రగుంట్ల కోలాట బృందం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండ రామ స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో ఎర్రగుంట్ల మహేశ్వరనగర్‌కు చెందిన శ్రీ ఉమామహేశ్వర కూచిపూడి కోలాట బృందం చిన్నారులు తమ కళలను ప్రదర్శి స్తున్నారు. ఆలయ అర్చకులు అయ్యలూరు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మాస్టర్ అభి పర్యవేక్షణలో చిన్నారులు రెండు రోజుల పాటు తమ కోలాట ప్రతిభను ప్రదర్శించి భక్తులచే శభాష్ అనిపించుకున్నారు. ఒంటిమిట్ట కోదండరాముని సన్నిధిలో తమ చిన్నారులు ప్రదర్శన చేయడం పట్ల ఈ ప్రాంత వాసులతో పాటు ముఖ్యంగా శ్రీ ఉమామహేశ్వర ఆలయ ధర్మకర్త, వార్డు కౌన్సిలర్ తుంగా వెంకటరామిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారులను అభినందించారు.

డాక్టర్ అచ్చన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : డాక్టర్ సి అచ్చన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని స్థానిక ప్రెస్ క్లబ్ లో అఖిలపక్ష నాయకులు పార్టీలు ఆధ్వర్యంలో 8వ తేదీన ఉదయం 10 గంటలకు జరిగే నిరసన ర్యాలీ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీ నాయకులు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం పార్టీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఎ సత్తార్, ఎమ్మార్పీఎస్ నాయకులు మత్తయ్య, చిన్న సుబ్బయ్య యాదవ్, రాజు, మైనార్టీ నాయకులు సయ్యద్ అహ్మద్ భాషా, ఆప్ నాయకులు శ్రీనివాసులు, ఆర్ సి పి నాయకులు ప్రసాద్ తస్లీమా, సిపిఐ జిల్లా నాయకులు ఆంజనేయులు, బాదుల్లా.. వలరాజు మైనుద్దీన్ దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కే మునయ్య. సిపిఎం పార్టీ నాయకులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 8వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ సర్కిల్లో పశుసంవర్ధక శాఖ డిడి సి అచ్చన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని దోషులను శిక్షించాలని నిరసన కార్యక్రమంలో వివిధ పార్టీలు ప్రజా సంఘాలు అఖిలపక్ష పార్టీలు నాయకులు రాష్ట్రస్థాయి ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొంటున్నా రన్నారు. దీనికి సంబంధించిన కరపత్రం ఈ సందర్భంగా విడుదల చేశామన్నారు. ఈ సంఘటనలో నిర్లక్ష్యం చేసిన పోలీసులపై చర్యలు తీసుకొని సిట్టింగ్ జడ్జితో విచారణ పూర్తి చేసి ఎవరైతే ఈయన మరణానికి కారణమయ్యారు వారందరినీ దోషులుగా చేర్చి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని వారు కోరారు. 2023 మార్చి 12వ తేదీన కడప నగరం సిఎస్ఐ చర్చి వద్ద కిడ్నాప్ అయ్యి 24వ తేదీన అన్నమయ్య జిల్లా రామాపురం గువ్వలచెరువు ఘాట్లో శవమై అన్నమయ్య జిల్లా పోలీసులు గుర్తించారు. డాక్టర్ సి అచ్చన్న కిడ్నాప్ అయిన రెండు రోజులకు అర్చనలు త్రివేణి కమిటీ సిఫారసు మేరకు సస్పెండ్ చేసి అదే శాఖలో పనిచేస్తున్న డాక్టర్ శారదమ్మను ఎఫ్.ఎ.సి. డిడి గా నియమిస్తూ ఆదేశాలు రావడం వెనుక డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ హస్తం ఉన్నదన్న ఆరోపణలు ఉన్నాయి. కావున డాక్టర్ సి అచ్చన్న తన విధి నిర్వహణలో ఎదురైనా వివక్షత, బెదిరింపులు, మానసిక ఒత్తిడి ,కిందిస్థాయి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించక పోగా తననే ఇబ్బంది పెట్టడంపై అనేక పర్యాయాలు శాఖ పరంగా ఉన్నత స్థాయి అధికారులకు, జిల్లా కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పరిష్కరించక పోగా తననే (డాక్టర్ సి అచ్చన్ననే)ఇబ్బంది పెట్టినట్లు ఉన్నత స్థాయి అధికారుల వైఫల్యం స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. కావున దళిత ఉన్నత స్థాయిఅధికారికే ఈ విధమైన వివక్షతో కూడిన వేధింపులతో హత్య చేయడం దారుణమన్నారు. కావున ఈ సంఘటనతో నిజా నిజాలు బయటపడాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఏప్రిల్ 8వ తేదీ శనివారం ఉదయం అంబేద్కర్ సర్కిల్లో నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వారు తెలిపారు.

సజ్జలకు సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక ఆర్ అండ్‌బి అతిథి గృహంలో సోమవారం ప్రభుత్వ సలహా దారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఘనం గా సన్మానించారు. అంతకు ముందు సింహాద్రిపురం మండలం కోవరం గుట్టపల్లె గ్రామంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి పెద్దఖర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన పలివెందుల ఆర్‌అండ్‌బి అతిథి గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, కో ఆప్షన్‌మెంబరు చంద్రమౌళి, పౌరసరఫరాశాఖ రాష్ట్ర డైరెక్టరు హాలు గంగాధర్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు సజ్జలను కలుసుకున్నారు. ఆయన్ను వారందరూ దుశ్శాలువతో సత్కరించారు.

ఎస్సీ జాబితాలో చేర్చడం అన్యాయం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొన్ని కులాలను ఎస్సీ జాబి తాలో చేరుస్తూ తీర్మా నం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయ కులు ఆర్.నాగ రాజు పేర్కొ న్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల తాహసీల్దార్ నాగేశ్వర రావుకు ఓ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే ఈ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన ఆ వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

వైసిపి ప్రభుత్వంలో ముదిరాజ్‌లకు ఒరిగిందేమీ లేదు

విశాలాంధ్ర - చెన్నూరు : నాలుగు సంవత్సరాల వైసిపి పరిపాలనలో రాష్ట్రం లోని ఏ ఒక్క ముది రాజ్ కుటుం బానికి ఆర్థికంగా సామాజికం గా న్యాయం జరగలేదని తెలుగుదేశం పార్టీ కడప ముదిరాజ్ సంఘం నాయకులు భరత్ కుమార్, యామల మణికంత పేర్కొన్నారు. సోమవారం వారు విలేకులతో మాట్లాడుతూ కేవలం నామమాత్రపు కార్పొరేషన్ ఏర్పాటు చేశారని ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ముదిరాజ్ కార్పొరేషన్ ద్వారా విడుదల చేసి సంఘం అభివృద్ధికి ఎలాంటి కృషి వైసిపి చేయలేదని తెలిపారు,బీసీ కార్పొరేషన్ నిధులను నవరత్నాల కు మళ్లించి తన సొంత ప్రచారం కోసం వైయస్ జగన్ వాడుకున్నారని తెలిపారు, కనీసం కార్పొరేషన్ చైర్మన్ లకు ట్రావెల్స్ కూడా నిధులు కేటాయించలేని వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజులకు ఏ విధంగా న్యాయం చేస్తుందని ప్రశ్నించారు,కొంతమంది సంఘ నాయకులు వారి లబ్ధి కోసం వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించకుండా సన్మానం చేయడం తగదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి : మాజీ మంత్రి సోమిరెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటన జయప్రదం చేయాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నాయకులకు సూచించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారము జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఈనెల 6న నిర్వహించే జోన్- 5 సమావేశానికి చంద్రబాబు నాయుడు వస్తున్నారని, ఈ సమావేశానికి 35 నియోజకవర్గ ఇన్చార్జిలు, క్లస్టర్లు, యూనిట్ ఇన్చార్జులు విచ్చేస్తారని, ఈ సమావేశంలో చంద్రబాబు నియోజక వర్గాల వారీగా సమీక్షిస్తారని, నాయకులు సమన్వయంతో ఎటువంటి లోటు పాట్లు లేకుండా విజయవంతం చేయాలని నాయకులకు సూచించినట్లు సమాచారం. సమన్వయ కమిటీ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, హరి ప్రసాద్ , పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

విశాలాంధ్ర-సిద్దవటం : జిల్లాలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని 10వ తరగతి పరీక్షల జిల్లా పరిశీలకులు వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేశామన్నారు. సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఏ సెంటర్లో 170 మంది విద్యార్థులు తెలుగు పరీక్షను రాయాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరు అయ్యాడన్నారు. అలాగే బి సెంటర్లో 154 విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంటల్ అధికారులు, చీఫ్‌లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - వల్లూరు : జలో రక్షితి రక్షితః జలని మనం కాపాడితే జలం మనల్ని కాపాడుతుంది. వేసవి కాలంలో దాహాన్ని తీర్చేందుకు వల్లూరు మండలం కడప తాడిపత్రి జాతీయ రహదారి గణేష్‌పురం వద్ద మండల విద్యాశాఖ అధికారిని లిల్లెమ్మ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం పోలేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, బాటసారులు, వాహనదారుల వేసవి కాలంలో దాహం తీర్చేందుకు ఉచిత కూలింగ్ వాటర్ చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు మాజీ ఉపసర్పంచ్ వంకదార ఆంజనేయులు, బాబు, రమేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేసిన వెంకటరమణయ్య

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం లోని మిట్ట వెంకట రమణయ్య శెట్టి (80సంవత్సరాలు) సోమవారం నేత్రాల ను దానం చేశారు. ఆయన మరణించ డంతో ఆయన కుమార్తెలు సూర్య ప్రభ, అరుణ, రమ, లత, అనిత, అల్లుళ్లు రమేష్, నగేష్ కుమార్, అశోక్ కుమార్, రమేష్, వర ప్రసాద్ లు నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి అధ్యక్షులు రాజుకు రజని ఫాన్సీ స్టోర్ యజమాని రజనికాంత్ ద్వారా సమాచారం రావడంతో హుటాహుటిన నేత్రనిధి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని స్వగృహం వెళ్లి అక్కడ పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టి లో కలిసి పోయే శరీరంలోని నేత్రాలు మట్టి పాలు కాకుండా శోకంలో ఉన్న కుటుంబ సభ్యులు మనసు నిబ్బరం చేసుకుని మానవతా దృక్పథంతో స్పందించి అంధత్వ నివారణకు తోడ్పాటు అందిస్తూ నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ 9966509364, 7093204537 లకు సమాచారం అందించినట్లు అయితే మరణం తరువాత కూడా మనిషి కళ్ళు సజీవంగా ఉండేలా అంత్యక్రియలకు ఎలాంటి భంగం కలగకుండా కార్నియాలను సేకరించి అంధులకు చూపు ఇచ్చే ఈ బృహత్కార్యాన్ని ప్రతికుటుంబం ఒక సంప్రదాయంగా అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేత్రదానానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను బంధువులు, సన్నిహితులు, సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, రాఘవేంద్ర రెడ్డి, చాంద్ బాషా తదితరులు కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర వల్లూరు : పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభ మైనాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు ఉండ టంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 9 గంటల లోపే చేరుకున్నారు. గతంలో 11 పరీక్షలు ఉండగా, ఈసారి 6 పరీక్షలకు కుదించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. మండలంలోని ఆదర్శ పాఠశాల నందు 305 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ లిల్లెమ్మ పర్యవేక్షించారు.

న్యాయవాదుల సంఘం ప్రెసిడెంట్‌గా జి.వి.రాఘవరెడ్డి ఎన్నిక

విశాలాంధ్ర-కడప లీగల్ : కడప న్యాయవాదుల సంఘంకు సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా జి.వి.రాఘవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా పి.బాలసుబ్రమణ్యం, జనరల్ సెక్రటరీగా జె.కెనడి, ట్రెజరర్‌గా భువన్ ఏకాదశిరెడ్డి, కల్చరల్ సెక్రటరీగా పి.చెన్నారెడ్డి, లైబ్రేరియన్ సెక్రటరీగా కె.విజయ్‌కుమార్ తదితరులు గెలుపొం దారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాలల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. పులివెందుల పట్టణంలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 1667 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 16 మంది ఆప్‌సెంటు అయినట్లు ఎంఈఓ వీరారెడ్డి తెలిపారు. అలాగే వేంపల్లె పంచాయతీ పరిధిలో మొత్తం నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 1046 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా వీరిలో ముగ్గురు గైర్హాజరయినట్లు ఆయన తెలిపారు. లింగాలలో మొత్తం 204 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఒకరు ఆప్‌సెంటు అయినట్లు చీఫ్ రవిచంద్ర తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అన్ని విధాలా సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు కూడా ముమ్మందు పరీక్షలు కూడా ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే తప్పక విజయం సాధిస్తారని వెల్లడించారు.

రైతులను దగా చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-చెన్నూరు : రైతులకు గిట్టుబాటు ధర లేక వర్షం వలన దళారుల చేతిలో నష్టపోతున్న రైతులను వెంటనే ఆదుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు కల్లూరి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెలు దిష్టిబొమ్మలుగా మారాయని, రైతులు వేసిన పంటను నమోదు చేసుకున్నాక వారికి సరైన ధర కల్పించి కొనుగోలు చేయాలి అలాకాకుండా 13వేల పైచిలుకు ఉండే వరిధాన్యం నేడు దళారులు సిండికేట్‌గా మారి పదివేలకే రైతుల వద్ద కొనడానికి ప్రయత్నిస్తున్నారని రైతులు ధాన్యాన్ని అమ్ముకోకుండా కల్లాలల్లో, రోడ్లపై నిల్వ ఉంచుకొని నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. 561 రైతు భరోసా కేంద్రాలు కట్టారు అవి దిష్టిబొమ్మలుగా మారాయే తప్ప రైతులకు ఉపయోగపడలేదన్నారు. అకాల వర్షాల వలన రైతులకు తీరని నష్టం వాటిల్లిందని ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామన్న ముఖ్యమంత్రి ఈ నాడు రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మల్లికార్జునరెడ్డి, కొండపేట మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షబ్బీర్ హుసేన్, పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ పవన్‌కుమార్‌రెడ్డి, కొండపేట సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, ఖాజాహుసేన్, శ్రీను, గౌస్‌పీర్, ఆచార భవానీ పాల్గొన్నారు.

చత్రపతి శివాజీకి ఘన నివాళి

విశాలాంధ్ర- పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండలం ఇందిరా నగర్ గ్రామంలో చత్రపతి శివాజీ వర్ధంతి వేడుక జరిగినట్లుగా కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షుడు ఉట్టి శ్రీనివాసులు. తెలిపాడు. చత్రపతి శివాజీ మహారాష్ట్రలోని పూణే జిల్లాలో జొన్నార్ పట్టణం సమీపంలోని శివనేరి కోటలో షాహాజీ, జిజియా బాయ్ దంపతులకు 1630 ఫిబ్రవరి 19వ తేదీన జన్మించి 1680 ఏప్రిల్ మూడో తేదీన మరణించాడు.శివాజీ జీవించిన 50 సంవత్సరముల కాలంలో సాధించినటువంటి అనేకమైన ఘనకార్యాల గురించి ఈ సందర్భంగా ఉట్టి శ్రీనివాసులు ఇందిరానగర్ యువతకు సందేశమిస్తూ శివాజీ సాధించినటువంటి యుద్ధాలలో అనేక విజయాలు, రాజకీయ చతురత, యుద్ధ విన్యాసాలు, శివాజీ యొక్క ధైర్యసాహసాలు గురించి వివరించారు. శివాజీ యొక్క ధైర్యసాహసాలు, దైవభక్తి మరియు దేశభక్తి నేటి తరం యువతకు ఆదర్శం కావాలన్నారు. శివాజీ తల్లి జిజి యబాయి చిన్నతనంలోనే శివాజీకి బోధించి నటువంటి రామాయణ, మహాభారత గ్రంథాల్లోని సారాంశం ఫలితమే ఆయన మహోన్నత వ్యక్తి కావడానికి కారణమన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీ స్త్రీలకు,చిన్న పిల్లలకు చత్రపతి శివాజీ యొక్క చరిత్ర నేర్పాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందన్నాడు.. కార్యక్రమంలో దంతిక పీరయ్య కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి, బిజెపి కిసాన్ మోర్చా మండల నాయకులు దంతిక శేఖర్, జింక బాలకృష్ణ, చిక్కోండు జగన్ మోహన్, పోసా మౌర్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం ఎందుకో

విశాలాంధ్ర-వేంపల్లె: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గ్రామ పంచాయితీ అదీనంలో ఉన్న మరుదొడ్ల నిర్మాణంలో జాప్యమెందుకని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలసి మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లి పట్టణం ఐదు మండలాలకు కూడలి అని ఎంతో మంది ప్రజలు తమ అవసరాలకోసం వేంపల్లి కి వస్తూ ఉంటారని ఇంత పెద్ద పట్టణంలో మరుగదొడ్లు సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు , ప్రజల నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటానికి ఎందుకు లేదని పంచాయితీ అధికారులను ప్రశ్నించారు, పంచాయితీ అధికారులు వెంటనే స్పందించి మరుగుదొడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులో కి తేవాలని కోరారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుస్మా, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్, రాజేష్,తిరుమలరెడ్డి, శశికుమార్,గోపీ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్య శిరోమణి బిరుదుతో సత్కారం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ వారు విజయవాడలో ఆదివారం ఉగాది పురస్కారాలు-2023 సంధర్భంగా జరిగిన జ్యోతిష్య సదస్సులో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన డా.మోహన్ కుమార్ గారికి జ్యోతిష్య శాస్త్రంలో చేసిన కృషికి 'జ్యోతిష్య శిరోమణి' బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దైవాజ్ఞ పుచ్చా శ్రీనివాసరావు, ప్రముఖ పంచాంగకర్తలు సంపత్‌కుమార్, అప్పలాచార్య, రవిశంకర్, జ్యోతిష్య ప్రముఖులు నాగలకొండ అశ్లేషాచారి, కంచి పీఠం ఆస్థాన సిద్ధాంతి, పుస్తక రచయిత పాలపర్తి శ్రీకాంత్‌శర్మగారు, పత్రికా సంపాదకులు కీలార్‌నాథ్, సంస్థ ప్రముఖులు విశ్వనాథ్, శ్రీనివాస్‌తో పాటు తెలుగురాష్ట్రాల నుండి విచ్చేసిన జ్యోతిష్యులు పాల్గొన్నారు.

పుట్టే ప్రతిబిడ్డ ఆరోగ్యంగా ఉండాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ లో పుట్టే ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని పోషణ్ పక్వాడ ప్రతి గర్భవతికి అందేలా చూస్తున్నారని 40 వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి అన్నారు. సోమవారం కడప నగరంలోని 40 వ డివిజన్ మరియాపురం -1 వ సెంటర్ నందు పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ తల్లులకు గర్భవతులకు న్యూట్రిషన్ గురించి చిరుధాన్యాల గురించి వివరించారు. అలానే ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు సంబంధించి పిల్లల తల్లులకు నలుగురికి 4 వేలు బహుమతిగా అందించడం జరిగింది. ఎస్ఎస్‌వై సుకన్య సమృద్ధి పథకం క్రింద ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ సునంద, సూపర్వైజర్ బాబుచాంద్, లక్ష్మీదేవి, రాధా, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పులివెందుల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పులివెందుల పట్టణంలోని సోలార్ ఫ్యాక్టరీ సమపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు శ్రీనివాసులు అనే వ్యక్తి సోమవారం ఉదయం సోలార్ ఫ్యాక్టరీలో పని కోసం వెళ్లి తిరిగి వస్తుండగా అక్కడి నుంచి వస్తున్న ట్రాక్టర్ తగలడంతో కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు చేస్తున్నట్లు తెలిపారు.

NAME CHANGE

I **SHAIK PRAVEEN NAAZ w/o MOHAMED RAFI SHAIK (Old Name)** residing at D.No. 78/213-2-8, Achari Colony, Rama Raju Palli, Kadapa , YSR Kadapa Dist. Is hereby declared that I have changed my Spouse Name as **SHAIK MAHAMMAD RAFI (New Name)** hereafter call all purpose in future.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

మొదటి రోజు ప్రశాంతంగా పది పరీక్షలు-వంద శాతం విద్యార్థులు హాజరు

ఆకస్మిక తనిఖీ నిర్వహించిన డిప్యూటీ డీఈఓ

విశాలాంధ్ర-గాలివీడు: మొదటి రోజు పది పరీక్షల్లో భాగంగా తెలుగు పరీక్ష ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ చక్రేనాయక్ తెలిపారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాలివీడులో మూడు పరీక్షా కేంద్రాలు మంజూరు చేయగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 180 మందికి గాను 180, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలో 220 మందికి 220, కస్తూరిభా పాఠశాలలో 149 మందికి 149 తో వంద శాతం విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరయ్యారన్నారు.వేసవి తీవ్రతను దృష్టిలో వుంచుకుని విద్యార్థులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.మండలంలోని మూడు పరీక్షాకేంద్రాలను డిప్యూటీ డిఈఓ వరలక్ష్మి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరిక్షాకేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై వెంకట శివ కుమార్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రైవేటు పాఠశాలలలో విద్యా హక్కు చట్టం-2009

విశాలాంధ్ర-పీలేరు: రాష్ట్రంలోని అన్ని గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలలో విద్యా హక్కు చట్టం-2009 లోని రూల్ -12(1) ప్రకారం ఒకటవ తరగతిలో 25శాతం సీట్లు ఉచితంగా పొందడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ చట్టం ప్రకారం 2023-24 విద్యా సంవత్సరానికి అన్నమయ్య జిల్లాలోని 350 ప్రైవేటు విద్యాసంస్థలలో దాదాపు 2300 మంది పేద విద్యార్థులకు జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలలో అడ్మిషన్లు పొందడానికి అవకాశం ఉంది. కావున జిల్లాలోని ఒకటవ తరగతిలో చేరబోయే విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈనెల పదవ తేదీ లోపల అందరూ సీఎస్ఈ .ఏపీ .జీఓవి .ఇన్ వెబ్సైట్ నందు అంతర్జాలంలో నమోదు చేసుకోవలెను. మండలాల వారీగా అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను ఆయా మండలాల ఎంఆర్సి ల నందు ప్రదర్శించడమైనది తల్లిదండ్రులు నేరుగా సచివాలయములో గాని, సంబందిత నెట్ సెంటర్స్ వెళ్లి అక్కడే రిజిస్టర్ చేసుకుననే అవకాశం కలదు. ఈ అవకాశాన్ని అందరు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి సంయుక్త ప్రకటనలో తెలియజేశారని పీలేరు మండల విద్యాశాఖాధికారి యం బాలాజీనాయక్ తెలిపారు.

అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయి:మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గాలివీడు: వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి గారు పేర్కొన్నారు.సోమవారం బోరెడ్డిగారి పల్లె, పూలుకుంట పంచాయతీలలో ఇదేం ఖర్మ మన రాష్టానికి రచ్చ బండ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దురాక్రమణలు వంటి కార్యక్రమాలతో ప్రజలు అసహ్యించుకునే రోజులు వచ్చాయి అన్నారు.ప్రధానంగా బడుగు బలహీన మైనార్టీ వర్గాల పింఛన్లు తొలగించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.అనంతరం ఆయన చుట్టుప్రక్కల పల్లెల్లో పర్యటించి ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథి రెడ్డి ,మాజీ ఎంపీపీ వెంకటనరాయణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్షుమయ్య,వెంకటశివరెడ్డి, మాజీ సర్పంచ్ లు మహమ్మద్ రియాజ్,ఈశ్వర్ రెడ్డి, చిన్నపరెడ్డి,ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, టోపి వలి సాబ్, వెంకట్రామిరెడ్డి, రామాంజులు రెడ్డి ,కొండ రెడ్డి ,ఉప సర్పంచ్ పిచ్చయ్య, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మిట్టె నాయక్, మాజీ నీటి సంగం అధ్యక్షులు రెడ్డెప్ప రెడ్డి,చెన్నారెడ్డి, మాదం భాస్కర్ రెడ్డి, మందపాటి రమేష్ బాబు , మాబు సుదన్ రెడ్డి, ఖదీర్ నాయుడు, ఇరగం రెడ్డి, ఖాజాపిర్, సాయి ప్రసాద్ రెడ్డి, వీరాంజనేయులు, ఉప సర్పంచ్ ప్రభాకర్ నాయుడు వెంకటేష్ నాయుడు,సుబ్రహ్మణ్యం నాయుడు, చలపతి నాయుడు,ఎస్టీ నాయకులు నాగేశ్వర నాయక్,తదితరులు పాల్గొన్నారు.

సైకో పోవాలి సైకిల్ రావాలి :టిడిపి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు నాయకులు ఇంటింటికి వెళ్లి సైకో పోవాలి సైకిల్ రావాలి అని గోడలకు టిడిపి స్టిక్కర్లు అతికించి విస్తృత ప్రచారం చేపట్టాలని నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు పిలుపు నిచ్చారు. సోమవారం గోడలకు టిడిపి స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో, ఉద్యోగులలో, గ్రాడ్యుయేట్ లలో వైసిపి అరాచక పాలన పై పెద్ద ఎత్తున తిరుగుబాటు ప్రారంభం అయిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనమన్నారు. ఆరాచక పాలనలో టిడిపి అభ్యర్థులు విజయం సాధించడం గోప్ప విషయమన్నారు.వైసిపి పని అయిపోయింది, టిడిపి ప్రభుత్వమే వచ్చేదని ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేపట్టి చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుంటు మడుగు వెంకటేశ్వరరాజు, కొమ్మాశివ, పులెల రమేష్ బాబు,కల్లా చలపతి, తేనేపల్లి చిన్న, తులసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిబి రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో లయన్ అశోక్ రెడ్డి,లయన్ షేక్ మహమ్మద్,లయన్ శ్యామసుందర్ రెడ్డి, లయన్ రెడ్డి కీర్తి రెడ్డి గార్ల ఆర్థిక సౌజన్యంతో లక్కిరెడ్డిపల్లి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం టిబి యూనిట్ రోగులకు పౌష్టిక ఆహారాన్ని అందజేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ,లక్కిరెడ్డిపల్లిలో ఉండే టిబి రోగులకు ఇప్పుడు ఈ రోజు 5 వ నెల అని వీళ్లకు ఒక్కొక్కరికి 700 రుపాయల చొప్పున 12 మంది టిబి రోగులకు న్యూట్రీషన్ ఫుడ్ అందజేసినామని ఇంకా 1 నెల రోజులు అందజెస్తామని తెలిపారు.అనంతరం దాతలు మాట్లాడుతూ మా వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ రోజు లక్కిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే టిబి యూనిట్ రోగులకు మా వంతుగా న్యూట్రిషన్ ఫుడ్ ఇవ్వడం జరిగిందని, ప్రతి ఒక్కరికి న్యూట్రిషన్ చాలా అవసరం అని సరైన న్యూట్రిషన్ వల్లనే ఆరోగ్యాన్ని అధికంగా కాపాడుకోగలమని తెలిపారు. మరీ ముఖ్యముగా టిబి ఉన్నవాళ్లకు న్యూట్రిషన్ ఫుడ్ చాలా ఉపయోగపడుతుందని ఈ ఫుడ్ ను సరైన సమయంలో తీసుకునడం వలన కోలుకోవడానికి వీలవుతుందన్నారు. అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిండెంట్ డా.నీలోఫర్ బేగం, డా.శ్రీనివాస రెడ్డి, డా.సుభాషిణి, డా.జీవన్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, టిబి యూనిట్ సూపర్వైజర్ హరి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంఘ సముద్రంలో టిడిపి నుంచి వైసీపీలో చేరిక

విశాలాంధ్ర-మదనపల్లి: రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి గుర్రంకొండ మండలంలోని సంఘ సముద్రం గ్రామంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రతి ఇంటి గడప కు వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు గ్రామాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ప్రతి ఇంటా తెలిపారు గడపగడప కార్యక్రమంలో అభివృద్ధి పనులకు కావాల్సిన డబ్బులు అక్కడికక్కడే మంజూరు చేయించారు మామూలు వారి పల్లికి త్రాగునీటి బోరు సిమెంటు రోడ్డు ఎల్లంపల్లికి మురికి నీటి కాలువలు సంఘ సముద్రం సిమెంట్ రోడ్డు మురికినీటి కాలువలు మసీదు దేవాలయాలకు అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు అనంతరం సంఘ సముద్రం లోని సుంకర మల్లికార్జున రిటైర్డ్ ఏఎస్ఐ ఎంపీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టిడిపి నుంచి వైసీపీలో చేరారు ఈ కార్యక్రమంలో రాష్ట్రమైనార్టీ కమిషనర్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆగామద్దీన్ హరీష్ రెడ్డి మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర జడ్పిటిసి సమ్రీన్ ముక్తియ ఆర్.బి.కె చైర్మన్ జయచంద్రారెడ్డి మాజీ సర్పంచ్ జమీర్ అలీ సచివాలయ కన్వీనర్ నాగేంద్ర మాజీ ఎంపీపీ నక్క చంద్రశేఖర్ ఎంపీటీసీ రాజగోపాల్, రెడ్డి కుమార్ కేతిరెడ్డి సాంబశివరెడ్డి కేతిరెడ్డి రెడ్డప్ప రెడ్డి అధికారులు ప్రజలు పాల్గొన్నారు

స్మశానదారిని ఆక్రమించారంటూ ధర్నా

విశాలాంధ్ర-రామసముద్రం: మండలంలోని వులపాడు పంచాయతీ గంపనపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద స్మశాన దారిని ఆక్రమించారంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన భాస్కరాచారి, నాగచారిలు గ్రామ సమీపంలో భూమి కొనుగోలు చేశారని తెలిపారు. అయితే భూమి కొనుగోలు చేసిన వారు కట్టు కాలువ స్మశానదారిని మట్టితో చదును చేసి ఆక్రమించేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రామసముద్రం తహసిల్దార్ దైవరాజన్ ఎస్సై రవీంద్రబాబులకు సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేద విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి:జెసి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలోని ప్రవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలతో పేద విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా తెలిపారు. ఏప్రిల్ 10 లోగా ఒకటవ తరగతిలో ఉచిత ప్రైవేట్ విద్యకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా సోమవారం మీడియా సమావేశంలో తెలిపారు. విద్య హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో 25% పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం 25% రిజర్వేషన్ కల్పించిందన్నారు. పేద విద్యార్థులకు ఇదొక సువర్ణ అవకాశ మన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 25 శాతం రిజర్వేషన్లో అనాథలు, హెచ్ఐవి, వికలాంగత్వం వారికి 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఓసి, బిసి, మైనారిటీ తదితర బలహీన వర్గాలకు 6శాతం మేర మేరకు రిజర్వేషన్ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 12(1) (సి) ప్రకారం 2023-24 విద్యా సంవత్సరం నుండి జిల్లాలో ఐబి, ఐసిఎస్ఇ, సిబిఎస్ఇ, స్టేట్ సిలబస్‌లను అమలు చేస్తున్న అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలను కల్పించాలన్న ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలల యాజ మాన్యాలు ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. జిల్లాలో 350 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందడానికి 2295 మంది పేద విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. దర ఖాస్తు చేయడానికి సహాయ కేంద్రాలు: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో పొందాలనుకునే పేద విద్యార్థులు తల్లిదండ్రులు ఆన్ లైన్లో దరఖాస్తు సమర్పించడానికి సహాయ కేంద్రాల సహకారం తీసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశాల కొరకు ఏప్రిల్ 10వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే సమీపంలో ఉన్న గ్రామ సచివాలయంలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో డిఈఓ పురుషోత్తం కూడా పాల్గొన్నారు.

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితోనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి అన్నారు.ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి ఎక్కటికప్పుడు సమస్యలను పరిష్కరిద్దామని ఆయన పిలుపు నిచ్చారు.సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శేఖర్ నాయక్ ఆద్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ముందుగా అజెండాలో పొందుపరిచిన అంశాలను శాఖల వారిగా పురోగతి వివరాలు,పనులు అమలౌతున్న తీరును సభ్యులకు వివరించారు.గ్రామ పంచాయతీల్లోని పాత, కొత్త పెండింగ్ కరెంటు బకాయిలను సర్పంచ్ లకు సంబంధం లేకుండా ఇక నుంచి ప్రభుత్వమే చెల్లించాలని,ఈ విషయమై ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లాలని నిర్ణయించారు. 2022,2023 సంవత్సరానికి సంబంధించిన 15 వ ఆర్థిక సంవత్సర పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆర్ డబ్ల్యు ఎస్ జె.ఈ ప్రతాప్ రెడ్డి తమ నివేదికను చదివి వినిపించారు.మండలంలో త్రాగునీటి సమస్యపై ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలం వచ్చినందున గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులదేనన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు కూడా వారి వారి గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు.త్వరలోనే అన్ని గ్రామాల్లో త్రాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేయిస్తామ న్నారు.మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ ఇంజినీర్,జనార్దన్, మహీంద్రా రెడ్డి వివరించారు.రెవెన్యూ అంశాలను డిప్యూటీ తహశీల్దార్ తిమ్మా రెడ్డి వివరించారు. ఓటీఎస్, జగనన్న సమగ్ర భూ సర్వే కొనసాగుతు న్నాయన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి,ఎంపీటీసీ లు,సర్పంచ్ లు,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బలిజపల్లెను పరిశీలించిన దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర -రాజంపేట: పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి బలిజ పల్లె గంగమ్మ సన్నిధిని దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శివయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ వున్న ప్రజలను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గతంలో గంగమ్మ సన్నిధిని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకునే ప్రయత్నం చేసినప్పుడు తయారు చేసిన రికార్డును పరిశీలించారు. అమ్మవారి విశిష్టత, అది, గురువారాల్లో ఎంత మంది భక్తులు వస్తారు, వచ్చిన భక్తులు అమ్మవారికి కానుకగా వేసే డబ్బులు ఎక్కడ వేస్తుంటారు, ఆ డబ్బులు ఏమవుతున్నాయి వంటి వివరాలను ఆయన రహస్యంగా విచారించినట్లు తెలిసింది. ఈ సందర్భంలో అమ్మవారికి సంబంధించి స్థలాలు కూడా ఉన్నట్లు పలువురు ఆయన దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం సేకరించిన వివరాలతో ఒక నివేదిక తయారు చేసి జిల్లా స్థాయి అధికారులకు పంపనున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. ఇదిలా ఉంటే గ్రామస్థులంతా మూకుమ్మడిగా దేవాదాయ శాఖ పరిధిలోకి అమ్మవారి సన్నిధి నీ తీసుకోవద్దని కోరితే ఆ ప్రయత్నాన్ని విరమించుకునే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. అయితే కొంత మంది నిర్వాహకులు సాంగ్యల విషయంలో ఒకటి అవుతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నే.

పదవ తరగతి పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే

కఠిన చర్యలు తీసుకుంటాం:ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: పదవ తరగతి పరీక్షలలో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో పలు పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల వద్ద లేక చుట్టుపక్కల ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు పరీక్ష సమయం ముగిసేవరకు మూసివయాలని, పరీక్షలు ముగిసేవరకు మైక్రో జిరాక్స్ చేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారి చేశారు. పరీక్షా కేంద్రాలకు ఎలాంటి స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేకుండా పకడ్బంధీగా చర్యలు తీసుకుంటామన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్, తదితర అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాల కస్తూరిబా బాలికల పాఠశాలలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 381మంది రాశారు. మండలంలో ఆదర్శ పాఠశాలలో 238 మంది విద్యార్థులకు గాను 4 మంది విద్యార్థులు గైరాజ రయ్యారు అలాగే కస్తూరిబా బాలికల పాఠశాలలో 143 మంది విద్యార్థుల గాను 1 గైర్హాజరు అయినట్లు ఆ పరీక్ష కేంద్రాల చీఫ్ లు హరిబాబు.భీలు నాయక్‌లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద లక్కిరెడ్డిపల్లి సీఐ వరప్రసాద్ రామాపురం ఎస్ఐ కొండారెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటన జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు ఎస్సై రామకృష్ణ ఎం ఈ వో వెంకటేష్ నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా వ్యాప్తంగా 544 మంది విద్యార్థులు ఉండగా సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తో పాటు జీకే రాచపల్లి పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లో 3 కేంద్రాలలో పరీక్షలు రాస్తున్నట్లు విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు. అనంతరం సుండుపల్లె ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని,కేంద్రాలలో అధిక సంఖ్యలో ప్రజలు గుమికూడ కూడదని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "స్పందన " కార్యక్రమంలో ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. అర్జీ దారుల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి మొత్తం 50 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

పజల్లో నమ్మకం కోల్పోయే సోషల్ మీడియా పై ఆశలు

టిడిపి నేత చమర్తి జగన్ రాజు ధ్వజం



విశాలాంధ్ర - రాజంపేట: ప్రజల్లో వైసీపీ ప్రభుత్వం నమ్మకం కోల్పోయే సోషల్ మీడియా పై ఆధారపడాలని ఎమ్మెల్యేలకు,మంత్రులకు హితబోధ చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత జగన్ రాజు ఎద్దేవా చేశారు.సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో రోజురోజుకు జనం మద్దతు కోల్పోతున్న వైసిపి సర్కార్ గత ఎన్నికల్లో లాగా ఈ ఎన్నికల్లో కూడా సోషల్ మీడియాలో జిమ్మిక్కులు చేసి అధికారంలోకి రావాలని చూస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టబద్రులు వైకాపా అభ్యర్థులకు వాత పెట్టారని ,అయితే మంత్రులు ఎమ్మెల్యేల సమావేశాల్లో ఈ గెలుపు చూసి తెలుగుదేశం బలుపు అనుకుం టుందని ముఖ్యమంత్రి మాట్లాడటం ఎన్నికల్లో ఓటు ద్వారా పాలక పక్షం పట్ల ఇచ్చిన తీర్పుకు కూడా ఓర్వలేక అహంతో మాట్లాడినట్లు కనిపిస్తోందన్నారు. 108 నియోజకవర్గాల పరిధిలో పట్టభద్రులు వేసిన ఓట్లు పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పడం. అధికారంలో ఉన్నామని అహంకారంతో ఉన్నట్లేనని విమర్శించారు. లోకేష్ పాదయాత్ర చూసి ఒకవైపు వణికిపోతూ గడపగడపకు పోవాలని ఎమ్మెల్యేలకు చెబుతున్నారని, అంటే ఇప్పటివరకు జనంలోకి వైకాపా ప్రజాప్రతినిధులు ఏ మేరకు వెళ్లారో సీఎం మాటల్లోనే స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా జనం ఈ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదన్నారు.ఈకార్యక్రమంలో అయన వెంట రాజంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల సాగర్, ముస్లిం మైనారిటీ నాయకులు కరీముల్లా, మండల సీనియర్ నాయకులు జీవి సుబ్బరాజు, పార్టీ నాయకులు గోపాల్ నాయుడు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-పీలేరు: స్థానిక మండలంలోని మొరం కింద పల్లి, మూరేవాండ్ల పల్లి, గ్రామపంచాయతీలో పలు పనులను పరిశీలించినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఆహ్వానితుడు శివయోగ శివాజీ, మండల అభివృద్ధి అధికారి గంగయ్య, మొరం కింద పల్లి గ్రామపంచాయతీ, అలకం వారి పల్లి లో సర్పంచ్ ఆధ్వర్యంలో చేసినటువంటి ఐదు లక్షల రూపాయలు విలువగల సిమెంట్ రోడ్లను పరిశీలించడం జరిగింది. అనంతరం మూరే వాండ్లపల్లి లో ఆరో ప్లాంట్ కు కావలసినటువంటి స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ యువనేత వేంపల్లి బావాజీ, మూరెవండ్లపల్లికి చెందిన కార్యకర్తలు, వీరభద్ర, తదితర కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

వైస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ :ఎంపిడివో

విశాలాంధ్ర-పీలేరు: నేడు వైస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం ఉంటుందని పీలేరు ఎంపీడీఓ మురళి కృష్ణరెడ్డి తెలిపారు. నేడు మద్యాహ్నం 2.00 గంటలకు జరుగు వైస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం తిరుపతి రోడ్ లోని యంఎస్ఆర్ గార్డెన్స్ నందు నిర్వహించు కార్యక్రమానికి రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి, పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్ మరియు రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ సభ్యులు హరీష్ రెడ్డి పీలేరు మండల పరిషత్ అధ్యక్షులు కంభం సతీష్ కుమార్ రెడ్డి,జడ్పీటీసీ రత్నాశేఖర్ రెడ్డి, పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, కో ఆప్షన్ మెంబర్ ఎండీ షఫీ, విచ్చేయుచున్నారని ఈ కార్యక్రమానికి పీలేరు మండల కో ఆప్షన్ సభ్యులు, వైస్ ఎంపీపీలు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మరియు అధికారులు, అనధికారులు హాజరు కావాలని, పీలేరు మండలానికి సంబంధించి 1274 సంఘాలకు 13 కోట్ల 87 లక్షల రూపాయలు సంఘాల ఖాతాలకు జమకావడం జరుగుతుందని తెలిపారు.

ఆహార పొట్లాలు పంపిణీ

విశాలాంధ్ర-చిట్వేలి : చిట్వేలి మండలం చిట్వేలి గ్రామం నివాసి గణేష్ హొటల్ (ఓం శివ కేశవ హొటల్) యజమాన్యం అధ్వర్యంలో సోమవారం నాడు అనాథలకు ఆహార పొట్లాలు పంపిణీ చేయడం జరిగింది. ప్రతి సోమవారం ఆహార పొట్లాలు ఇవ్వడానికి ముందుకు రావడం పట్ల గణేష్ హొటల్ వారికి మానవతా సేవా సంస్థతరపున అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చౌడవరం సురేంద్ర రెడ్డి అధ్యక్షులు కుంభగిరి ముని రావుగణేష్ హొటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-గాలివీడు: పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతులు ప్రధానం చెయ్యనున్నట్లు ఎస్ఆర్ఐ చెంచు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యా దానం గొప్పదని విశ్వసించి ప్రతీ ఏటా ఇచ్చే శ్రీ వేంకటేశ్వర అకడమిక్ ఎక్సెలెన్స్ అవార్డ్ ను 2023 సంవత్సరానికి గాను రాయచోటి నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి రూ.5,116, రూ.4,116 రూ.3,116 నగదు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల సహకారంతో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం డీఈఓ చేతుల మీదుగా ప్రశంశాపత్రం,నగదు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు.

పార్టీ కార్యకర్త మృతికి నివాళులర్పించిన హరీష్ రెడ్డి

విశాలాంధ్ర-కలికిరి: స్థానిక కలికిరి మండలంలో మర్రికుంటపల్లి పంచాయతీ యల్లంపల్లి నందు వైయస్సార్సీపి నాయకులు బొండ్డుమల్ల శ్రీనివాసులు రెడ్డి, అనారోగ్య కారణంగా మరణించారు. రాష్ట్ర ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, హరీష్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసి అన్ని విధాలుగా పార్టీకి సహాయం చేశాం న్నారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వైస్సా ర్సీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ తోడు ఉంటుందన్నారు.

చెరువు కనపడలేదంటూ ఫిర్యాదు

విశాలాంధ్ర- రామసముద్రం: తమ గ్రామ పరిధిలో చెరువు కనబడలేదంటూ స్పందనలో ఫిర్యాదు చేసినట్ల మండలంలోని కుదురుచీమనపల్లె గ్రామస్తులు తెలిపారు తమ గ్రామ సమీపాన కొత్త కుంట చెరువు పూర్తిగా దురాక్రమ గురైనట్లు తెలిపారు. స్పందనలో ఫిర్యాదు చేసిన విఆర్వో శ్రీనివాసులకు సమస్య చెప్పిన ఇంతవరకు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసిల్దార్ దైవరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 25 ఎకరాలకు పైగా ఉన్న చెరువు నేడు పూర్తిగా తన రూపాన్ని కోల్పోయిందని అక్రమార్కుల దురాక్రమణలో గల్లంతైందని చెప్పారు. జిల్లా రెవిన్యూ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిమ్మనపల్లిలో ఇదేం ఖర్మ కార్యక్రమం

విశాలాంధ్ర- నిమ్మనపల్లి: నిమ్మనపల్లెలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో తెలుగుదేశం కార్యకర్తలు ముందు వరుసలో ఉంటారని అందులో భాగంగా ఈరోజు దిగువపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గత ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి అమలు చేయలేని హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదన్నారు. ఈ సందర్భంగా దిగవ పల్లెలోని మహిళలు మాజీ శాసనసభ్యులు దృష్టికి తమ ఊరిలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని తాగునీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఊరిలో మురుగునీటి కాలువలు లేవని సిమెంట్ రోడ్లు కూడా లేవన్నారు. తాగునీటి సమస్యపై వెంటనే నిమ్మనపల్లి ఎంపీడీవో ని సంప్రదించగా గ్రామ సెక్రటరీని పంపి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో నిమ్మనపల్లి అప్పటికప్పుడే తెలిపారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే పెంచిన ధరలు తగ్గిస్తామని సిమెంట్ రోడ్లు కాలువలు నిర్మిస్తామని రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మునిరత్న మాజీ ఎంపీపీ మల్లికార్జున మాజీ జడ్పిటిసి రెడ్డప్ప రెడ్డి రమణ జొన్న చంద్ర శ్రీనివాసులు రామచంద్ర కృష్ణప్ప గబ్బర్ సింగ్ శంకర పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ డాక్టర్ నిత్యాకు జాతీయ స్థాయి అవార్డు

విశాలాంధ్ర-మదనపల్లి: చెన్నై లో జరిగిన అవార్డు కార్యక్రమంలో వణక్కం - హ్యూమన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు బెస్ట్ ఫాకల్టీ అవార్డు ను ప్రదానం చేశారు అని అన్నారు. కంప్యూటర్ సైన్స్ రంగం లో చేసిన పరిశోధన మరియు అభివృద్ధిని గుర్తించి ఈ జాతీయ స్థాయి అవార్డును అందజేసి నట్లు ఆయన అన్నారు. అవార్డును అందుకున్న డాక్టర్ ఆర్ నిత్యాను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అభినందనలు తెలియజేసారు.

తలుపులలో వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమం

విశాలాంధ్ర-పీలేరు: వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అందత్వ సమస్యలను నివారించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం తలుపుల గ్రామ సచివాలయంలో అవ్వ తాతలు అందరికీ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 52 మందికి కంటి పరీక్షలు నిర్వహించి,18 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించి, మిగిలిన వారికి కంటిమందులు,మాత్రలు పంపిణీ చేయడమైనదని తెలిపారు. ఇతర కంటి సమస్యలు బాధపడే వారికి కూడా ఆధునిక కంటి వైద్యాన్ని ఉచితంగా వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తుందని డాక్టర్ చంద్రశేఖర్ మరియు కంటి వైద్య సహాయకులు బాబు సంయుక్తంగా తెలియజేశారు.

10వ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన ఎంఎల్‌ఏ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:పదవ తరగతి విద్యార్థులు ఎటువంటి వత్తిడులకులోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కోరుతూ ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.విద్యార్థులు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని, ఆందోళన చెందరాదని ఆయన సూచించారు. చదివిన దానిని మననం చేసుకుంటూ పరీక్ష కేంద్రానికి ముందుగా చేరుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు.ఆతృత పడకుండా ఆలోచనతో ప్రశ్నపత్రాన్ని చదువుకొని జవాబులను రాయాలని ఎంఎల్‌ఏ సూచించారు.

ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రతి సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్, ఎస్ పి కార్యాలయాలకు వచ్చే గ్రీవెన్ సెల్ అర్జీదారులు, ప్రజలకు ఎం ఎల్ ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం నేటితో పద్నాలుగువ వారానికి చేరుకుంది. వైసిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ సౌజన్యంతో ఈ సోమవారం జిల్లా కలెక్టరేట్, ఎస్ పి కార్యాలయా లకు గ్రీవెన్ సెల్ నిమిత్తం వచ్చిన అర్జీదారులు, ప్రజలకు కలర్ రైస్, చికెన్ తో కూడిన అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రుచికరమైన భోజనంతో పాటు అరటిపండును సైతం అందచేస్తున్నారు. వారం వారం ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో, దాతల సౌజన్యంతో గ్రీవెన్ సెల్ రోజున జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలకు రుచికరమైన,నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తుండడం హర్షణీయం, ఆదర్శనీయమంటూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజుర్ రెహమా న్, సుగవాసి శ్యామ్,అన్నా సలీం, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, జావీద్,అమీర్ పాల్గొన్నారు.

బీరువాలో నగలు చోరీ, కేసు నమోదు

విశాలాంధ్ర-కలికిరి: స్థానిక కలికిరి పట్టణంలో టీవీ రోడ్డు నందు ఇంటి తాళాలు పగలకొట్టి, దొంగతనం జరిగిన సంఘటన కలికిరిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు స్థానిక టీబి రోడ్డులోని రెండవ వీదిలో కాపురముండు పి.సుబ్రహ్మణ్యం తన ఇంటికి బీగాలు వేసుకొని గత ఆదివారం రాత్రి తన భార్య బిడ్డలతో కలిసి ఇంటి మిద్దెపైన పడుకొని, తిరిగి సోమవారము ఉదయము 4-00 ఉదయం గంటల ప్రాంతములో వారు క్రిందికి రాగా, అప్పటికే ఎవరో గుర్తు తెలియని దొంగలు ఇంటి బీగాలను పగులగొట్టి, ఇంటిలోనికి ప్రవేశించి, బీరువాలోని సుమారు 80 గ్రాముల బంగారు నగలను చోరీ చేసుకొని వెళ్ళినట్లు గుర్తించి, కలికిరి పోలీసు స్టేషన్ లో రిపోర్టు ఇవ్వగా, వాయల్పాడు ఇంచార్జి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. నాగేంద్ర, కలికిరి పోలీస్ స్టేషన్ ఎస్సై లోకేశ్ రెడ్డి, ఆదేశాల మేరకు ఎన్ .మధుసూదనాచారి కేసు నమోదు చేసి, క్లూస్ టీం ను రప్పించి, సంఘటనా స్థలములో వేలిముద్రలను సేకరించి, సమీపములోని సిసి ఫుటేజ్ లను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలంకారప్రాయంగా మంచినీటి ట్యాంక్

విశాలాంధ్ర-గాలివీడు: మండల కేంద్రం లోని స్థానిక హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంక్ అలంకారప్రాయంగా మారింది. ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కా రం కోసం లక్షల రూపా యలు వెచ్చించి నీటి పథకాలను అందుబాటులోకి తెస్తుంటే వాటిని వినియోగంలోకి తేవడంలో మాత్రం అధికా రుల నిర్లక్ష్యం స్పష్టం గా కనబడు తోంది. గాలి వీడు పట్టణ పరిధిలో శెట్టివారి పల్లెకు సంబం ధించిన మంచి నీటి ట్యాంక్ నూత నంగా నిర్మించినప్పటికీ వినియోగంలోకి మాత్రం తీసుకురావడం లేదని చుట్టుప్రక్కల ప్రజలు ఆరోపిస్తు న్నారు. గుత్తేదారు బిల్లుల చెల్లింపులో జాప్యమా?వాటర్ గ్రిడ్ లో లోపమా? లేక అధికారుల అలసత్వమా? తెలీదుగానీ వెరసి మంచి నీటి ట్యాంక్ మాత్రం దిష్టి బొమ్మలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓ వైపు వేసవి వచ్చేస్తోంది నీటి ఎద్దడి ముంచుకొస్తోంది.ఇలాంటి తరుణంలో అందుబాటులో వున్న నీటి వనరులను సక్రమంగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిహెచ్‌పిఎస్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో, ఆదివారం జరిగిన దళిత హక్కుల పోరాట సమితి(డి హెచ్ పి ఎస్) అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మండెం సుధీర్ కుమార్ తెలిపారు. 15 మందితో ఎన్నికైన ఈ కమిటీకి జిల్లా అధ్యక్షులుగా మంచాల హరి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండెం సుధీర్ కుమార్ ఎన్నికైనట్లు, మరో 13 మంది ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లాలో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు.

పది పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గదులలో తిరుగుతూ, పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా గమనించారు. విద్యార్థుల హాజరు గురించి జాయింట్ కలెక్టర్ ఆరా చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, అత్యవసర మందులు ఉన్నాయా లేదో పరిశీలించారు. పరీక్షలకు హాజరైన తీరును చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఇతరులు ఎవరూ పరీక్ష కేంద్రాలలోకి రాకుండా చూడాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓను సూచించారు. అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచుతూ ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తుండడంతో జేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో జాయింట్ కలెక్టర్ తో డిఈఓ పురుషోత్తం, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్లో..బాల్యం బందీ..!

- పిల్లలకు వ్యసనంగా మారిన.. సెల్ ఫోన్లు
- ముమ్మాటికి దీనికి తల్లిదండ్రులే ప్రధాన కారణం
- ఆట బొమ్మలకు బదులుగా సెల్ ఫోన్లు ఇస్తున్న వైనం
- వినికిడి శక్తిపై ప్రభావం చూపుతుందంటున్న వైద్యులు

విశాలాంధ్ర -రాజంపేట:తల్లి పాల కోసం ఏడవాల్సిన చిన్నారులు సెల్ ఫోన్ ను దూరం చేయగానే తట్టుకోలేక ఏడుస్తున్నారు.చందమామ రావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే..గోగు పూలు తేవే..అంటూ గతంలో ఆకాశం వైపు చేయి చూపుతూ చిన్నారులకు గోరుముద్దలు తినిపించేవారు.అమ్మ లాలన..ప్రేమ అక్కడి నుంచే మరుపురాని అనుబంధంగా మారుతుంది.కానీ, నేడు ఆ పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. నేటి ఆధునిక యుగంలో పిల్లలంతా టెక్నాలజీతోనే స్నేహం చేస్తున్నారు.తల్లి గర్భంలో నుండి బయటకు రాగానే చిన్నారి చేతిలో సెల్ఫోన్ పెడుతున్నారు.పైగా మావాడు సెల్ ఫోన్ లేకపోతే అన్నం ముట్టుకోవడం లేదంటూ గర్వంగా చెబుతున్నారు.బాల్యం నుంచే చిన్నారులు సెల్ ఫోన్ కు బందీ అవుతున్నారు.

రాజంపేట పట్టణ కేంద్రంలో ఉన్న చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు అడిగిన వెంటనే సెల్ ఫోన్ ఇవ్వడం ఒక అలవాటుగా చేసేశారు. అమ్మ సంక లో ఉన్న చంటి పిల్లాడు చేతిలో కూడా సెల్ఫోన్ ఉండడంతో ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పుట్టినప్పటినుంచి అమ్మ సాంగత్యంలో మాటలు,నాన్న చేయి పట్టుకుని అడుగులు వేయడం నేర్చుకునే చిన్నారులు, ఇప్పుడు తల్లిదండ్రులకు కాకుండా సెల్ ఫోన్ కు దగ్గరవుతున్నారు. చిన్నారులు ఏడిస్తే వారు ఏది ఇస్తే.! ఏడుపు మానేస్తారో అదే ఇస్తున్నారు. అదేంటో అందరికీ తెలిసిందే.. సెల్ ఫోన్! పైగా మా అబ్బాయి ఫోన్ ఆఫ్ చేసి ఆన్ చేస్తాడు.. ఆటలు ఆడతాడు.. మాకు కూడా చేతకాదు.. ఎన్ని తెలివితేటలో అంటూ తల్లిదండ్రులు తమ పిల్లల గురించి చెబుతూ మురిసిపోతున్నారు.సోషల్ మీడియాలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో..దుష్ఫలితాలు అంతకుమించి ఉన్నాయన్నది వాస్తవం.ఇప్పటికే అనేక సంస్థలు వెల్లడించిన విషయం తెలిసిందే.అయితే ఈ మధ్య మాల ఉచ్చులో బాల్యం బంది అవుతున్నది.ఇదే పెద్ద ప్రమాదం అంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెండేళ్ల లోపు చిన్నారులు సైతం సెల్ ఫోన్ లకు అలవాటు పడడం వలన మాటలు ఆలస్యానికి కారణాలుగా వీటిని నిర్ధారించారు. పుట్టినప్పటినుంచి రెండేళ్ల లోపల ప్రతి చిన్నారి లోను ఒక నిమిషానికి ఏడు వేల న్యూరాన్ లు ఒకదానికొకటి సంబంధం ఏర్పరచుకున్నాయి.ఇది ఏర్పరచుకున్న సమయంలో అవి మెదడులో వినికిడి శక్తికి, మాట్లాడడానికి అవసరమైన వాటిని అభివృద్ధి చేస్తాయి. ఈ రెండేళ్ల లోపే అవి పెరిగే క్రమంలో చిన్నారులు చూస్తున్న దానిని గ్రహించాలనే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలోనే ఫోన్ ఇస్తే ఫోన్ లో వినబడే మాటలు వింటుంటాడు. కానీ పెదాల కదలికలను గుర్తించలేడు. దీంతో వినికిడి శక్తి మామూలుగానే ఉంటుంది.కానీ దానిని మాటలుగా మార్చే ప్రక్రియ ఎదగదు.

వినికిడి శక్తిపై ప్రభావం: జంతువుల నుంచి మనుషులను వేరు చేస్తుంది కేవలం మాటే! అదే మాటనే భాషగా మార్చుకొని మానవుడు ఎంతో ఎత్తుకు ఎదిగాడు.ఈ మాటకు ప్రధాన కారణం వినికిడి శక్తి. ఈ వినికిడి శక్తి అనేది చిన్నారుల్లో రెండేళ్లలోపే పూర్తిస్థాయిలో ఏర్పడుతుంది.ఈ రెండేళ్లలో దీని ద్వారానే మాట వస్తుంది.అనేక లోపాల కారణంగా చిన్నారుల్లో వినికిడి శక్తి కోల్పోతున్నారు. కానీ అన్ని ఉండి వినికిడి శక్తి అక్రమంగా ఉండి మా అబ్బాయికి రెండేళ్లు వచ్చినా మాటలు రావడం లేదంటూ.. వైద్యుల వద్దకు ఇటీవల కాలంలో పదుల సంఖ్యలో తల్లిదండ్రులు వస్తున్నారు.వారిని అన్ని రకాలుగా పరీక్షించిన వైద్యులు ఏ లోపం లేదని, వినికిడి శక్తి వంద శాతం సక్రమంగా ఉందని చెప్పిన వారుకూడా మాటలు ఎందుకు రావడం లేదు అనే దానికి కారణాలు వెతుకుతున్నారు.ఇది ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మందికి ఈ ఎన్ టి వైద్యుల వద్దకు వచ్చిన సమస్య. దీంతో పరిశోధించిన శాస్త్రవేత్తలు నిర్ధారించిన విషయం ఒక్కటే అదే స్మార్ట్ టచ్ ఫోన్.

మెదడుపై ప్రభావం: చిన్నారులు సాధారణంగా పది గంటలు మెలకువగా ఉంటారు. అందులో భోజనానికి, స్నానానికి మూడు గంటలు పోయిన గ్రహణ శక్తి ఉండే సమయం ఏడు గంటలు.. ఈ ఏడు గంటల్లో రెండు గంటలు టచ్ ఫోన్ ఇచ్చినా సాధారణంగా ఆడియో ప్రభావం కన్నా వీడియో ప్రభావం మెదడుపై ఎక్కువగా ఉంటుంది.కాబట్టి ఆ ఏడు గంటలకు కూడా దీని ప్రభావమే ఉండి చిన్నారి కొత్త విషయాన్ని మాట్లాడడానికి ప్రయత్నించడు. అదే మాటలు ఆలస్యంగా రావడానికి కారణం అవుతుంది.

గుర్తించడం ఎలా: చిన్నారులు టచ్ ఫోన్ కు బానిస అయ్యాడని గుర్తించాలి.దీనికి ఒక్కటే మార్గం చిన్నారులు నుంచి సెల్ ఫోన్ తీసుకోగానే అసాధారణ ప్రవర్తనకు దిగుతాడు.మామూలుగా పిల్లలు ఏడుస్తారు..కానీ ఈ లక్షణాలు ఉన్నవారు తల గోడకేసి కొట్టడం,చేతితో బలంగా గోడను కొట్టడం వంటి అసాధారణ ప్రవర్తనకు వెళతారు.కారణం వీడియో చూపే ప్రభావం వీటిని గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

ఇలా అధిగమించవచ్చు: మార్పు అనేది తల్లిదండ్రుల నుంచే మొదలు కావాలి. మొబైల్ పై నియంత్రణ అనేది వారి నుంచే ప్రారంభమవ్వాలి. మొబైల్ ఫోన్ వాడడం తగ్గించాలి. అవసరం ఉంటే తప్ప ఇతర వ్యక్తులతో మాట్లాడవద్దు.అప్పుడే తల్లిదండ్రులను చూసి పిల్లలు తమ వాడకం తగ్గించుకుంటారు. అలాగే ప్రతి ఇంట్లోనూ మొబైల్ ఫ్రీ జోన్ ఏర్పాటు చేసుకోవాలి.ఉదాహరణకు బెడ్ రూమ్,డైనింగ్ ప్లేస్ లో ఫోన్ వాడకుండా ఉండాలి. అక్కడ తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాడవద్దు. ప్రతిరోజు కొద్ది సమయం స్క్రీన్ లేని టైం గా డిక్లేర్ చేసుకోవాలి.ఇది ప్రతి ఇంట్లోనూ జరగాలి.వీటి ద్వారా పిల్లలు మెల్లమెల్లగా మొబైల్ ఫోన్ చూడడం మానేస్తారు.

మృత్యువు జంక్షన్.. వైజంక్షన్.!

- స్వీయనియంత్రణే ప్రత్యామ్నాయం
- బోయినపల్లి జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు
- మితిమీరిన వేగం. నిర్లక్ష్యం..
- తల్లిదండ్రులకు గర్భకోశాన్ని మిగిల్చుతున్న ప్రమాదాలు
- సత్ఫలితాలివ్వని పోలీసుల చర్యలు
- తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ప్రమాదాలు

విశాలాంధ్ర -రాజంపేట: జీవితమంటే లెక్క లేదు.. ప్రాణాలంటే భయం లేదు. ఏమవుతుంది లేనన్న నిర్లక్ష్యం.. చట్టాలపై చిన్న చూపు.. వెరసి ఒళ్ళు తెలియని వేగం.. ఫలితం ప్రాణాలు గాలిలో కలిసిపోవడం! భద్రతా ప్రమాణాలు పాటించాలన్న స్పృహ ఉండదు.. మన వేగం ప్రాణాంతకరం కాకూడదన్న ఆలోచన ఉండదు. ఎన్నో విజయాలను సొంతం చేసుకుని పూలదండలతో అభినందనలు అందుకోవలసిన వయసులో ఫోటోలకు దండలు పడుతున్నాయి. క్షేమంగా ఇంటికి రావాల్సిన వారు స్మశానానికి పయనమవుతున్నారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే రాజంపేట మండల కేంద్రంలోని బోయినపల్లి బైపాస్ జాతీయ రహదారిలో ఉన్నటువంటి వై జంక్షన్ అని చెప్పడంలో సందేహం లేదు. రెండు రోజుల క్రితం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం పాలయ్యారు. గతంలో కూడా ఈ రహదారిపై అత్యధికంగా యువకులే మృత్యువాత పడ్డారు. ఈ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సువిశాలమైన ఈ రహదారి రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. అతివేగం.. మద్యం మత్తు.. నిద్రమేమి.. నిర్లక్ష్యం తదితర కారణాలతో జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోతూ గర్భశోకాన్ని మిగులుస్తోంది. జిల్లాలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. ఫలితంగా అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.మరికొందరు విగత జీవులై పోతున్నారు. జిల్లాలో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాల్లో స్వయం కృతంతో కొందరు, ఇతరుల నిర్లక్ష్యం, అతివేగం,నిద్రమత్తు వంటి కారణాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖరీదైన వాహనాలు రై..రై మంటూ దూసుకెళుతూ.. చివరికి అది ప్రాణాలు మింగేసి గర్భశోకం మిగిలిస్తోంది. ఆరు గంటలు ప్రయాణం చేయాల్సిన దూరాన్ని కేవలం నాలుగు గంటల్లోనే చేరితే వచ్చే లాభం ఏమిటి! మద్యం మత్తులో ఒళ్ళు తెలియని వేగంతో జరిగే అనర్థానికి ఎవరు బాధ్యులు! వేగం ఎక్కడ అవసరం, ఎక్కడ అనవసరం అని విచక్షణ ఉండాలి. ప్రాణం తీసే వేగం, చూసేవారి నరాలు తెగిపోయే వేగం ఎన్నటికీ ప్రమాదకరమే. వేగం.. వెన్నంటి ఉండే శత్రువు.. ఇంకా చెప్పాలంటే వెంటాడే మృత్యువు. వేగం పెరిగిన కొద్దీ మృత్యువుకి దగ్గరవుతున్నట్లే, పగలైనా, రాత్రయినా ఎప్పుడు ప్రాణాంతకమే. వాహనం నడిపే వారికి, వాహనంలో ఉన్నవారికి, ప్రాణ సంకటమే. వాహనం నడిపేవాడు ఒక్కడు అజాగ్రత్తగా ఉంటే ఎన్నో ప్రాణాలకు మృత్యువు పొంచి ఉన్నట్టే. మరెందరికో గర్భశోకం గుమ్మం దాకా వచ్చినట్టే.వాహన వేగానికి మద్యం మత్తు తోడైనా, నిద్రలేమి జత కలిసినా, నిర్లక్ష్యం పేరుకుపోయినా.. మృత్యు తిష్ట వేసినట్లే! జాతీయ రహదారులపై ప్రతిరోజు ఎక్కడో ఒకచోట జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో గువ్వల చెరువు ఘాట్, నందలూరు, ఊటుకూరు, బాకరాపేట, కడప తిరుపతి జాతీయ రహదారిపై ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

స్వీయ నియంత్రణే ప్రత్యామ్నాయం: రోడ్డు ప్రమాదాలు తగ్గాలన్నా.. మరణాల రేటు కుదించాలన్నా వేగా నియంత్రించుకోవడం మినహా మరో ప్రత్యామ్నయం లేదు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్న.. వాహనదారుడు స్వీయ నియంత్రణ అవసరం.ఇది ఒకరు చెబితే వచ్చేది కాదు. ప్రాణాలతో చలగాటం ఎప్పటికీ ప్రమాదకరమే.దుర్ఘటన జరిగిపోయిన తర్వాత బాధపడితే లాభం లేదు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత గుర్తుంచుకోవాలి.ఒక చిన్న తప్పు పెను ప్రమాదానికి దారితీస్తుంది.

మృతుల్లో యువకులే ఎక్కువ: జిల్లాలో రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు.ఈ సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే వస్తోంది. ఇందుకు ప్రధాన కారణం మితిమీరిన వేగం అని చెబుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో సగం మంది యువకులే ఉండడం గమనార్హం.వీరి మరణాలు తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుచుతోంది.

సత్ఫలితాలివ్వని పోలీసుల చర్యలు: జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రవాణా శాఖ, పోలీసులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదని ప్రజల నుండి బహిరంగంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లైసెన్స్, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై, త్రిబుల్ రైడింగ్, రికార్డులు లేని వాహనదారులపై ఫైన్‌లు వేస్తున్నారే తప్ప ప్రమాదం జరిగే ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టడం లేదనే అపవాదను మూట కట్టుకున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో బారికేడ్లు ఏర్పాటు చేస్తే కొంతవరకైనా ప్రమాదాలు తగ్గుతాయని ప్రజల నుండి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.